మీసం తిప్పిన మీనం

- రూ. 650 పలికిన కిలో కొర్రమీను
- వికారాబాద్, మేడ్చల్ జిల్లాల వ్యాప్తంగా ఘనంగా మృగశిర కార్తె సందడి



వికారాబాద్‌లో చేపల విక్రయాలు

ఆంధ్రజ్యోతి, మేడ్చల్, జూన్ 8: మృగశిర కార్తె వేడుకలను వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో శనివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో మాంసం, చేపల విక్రయాలు జోరుగా సాగాయి. పరిగి, వికారాబాద్, తాండూరు, ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేటలో చేపల ధరలు ఆకాశాన్నంటాయి. కొర్రమీన్లు కిలో రూ.600 నుంచి రూ.650 పలకగా.. బొచ్చలు, బంగారుతీగలు రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయించారు. కిలో చికెన్ సైతం రూ.280 నుంచి 300 అమ్ముడు పోయింది. కిలో మాంసం రూ.750 నుంచి 800 వరకు విక్రయించారు. పరిగిలో కొర్రమీను కిలో రూ.600 పలికింది. అలాగే బొచ్చ, రవ్వసాధారణ రోజుల్లో కిలో రూ.150 ఉండగా రూ.200 పలికింది. గ్రామాల్లో చెరువు వద్ద చేపల కోసం జనం బారుల దీరారు. కాగా శనివారం మృగశిరకార్తె కావడంతో చేపల విక్రయాలు తగ్గాయని వ్యాపారులు పేర్కొన్నారు. ఈసందర్భంగా రైతులు వానాకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



తాళ్లకుంట చెరువు వద్ద చేపల విక్రయాలు



రావుల్‌పల్లిలో చేపలు పడుతున్న మత్స్యకారుడు

నేడే గ్రూప్-1 ప్రిలిమ్స్

- జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 5,468 మంది అభ్యర్థులు
- 10 గంటల తరువాత నో ఎంట్రీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- పటిష్ట బందోబస్తు: ఎస్పీ కోటిరెడ్డి



వికారాబాద్‌లో పరీక్షా కేంద్రం

వికారాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ జిల్లాలో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ పరీక్షకు మొత్తం 5468 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 13 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రిలిమ్స్ పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన పకడ్బందీ చర్యలు తీసుకుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాజరును బయో మెట్రిక్ విధానం ద్వారా నమోదు చేయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో బయో మెట్రిక్ యంత్రాలు ద్వారా అభ్యర్థుల వేలి ముద్రలతో వారి హాజరును నమోదు చేయనున్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రాల మెయిన్ గేట్లు మూసివేస్తారు. ఆ తరువాత వచ్చే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించరు. స్ట్రాంగ్‌రూం, పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మెటల్ డిటెక్టర్ ద్వారానే అభ్యర్థులు లోపలికి ప్రవేశించాల్సి ఉంటుంది. పరీక్షా కేంద్రాల గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. కేంద్రాలకు 500 మీటర్ల దూరం వరకు జనం గుమికాకుండా చర్యలు చేపట్టారు. పరీక్ష సజావుగా కొనసాగేందుకు వీలుగా రూట్ అధికారులు, ఇడెంటిఫికేషన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లను నియమించారు. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, టీజీపీఎస్సీ రీజినల్ కో ఆర్డినేటర్ రాజేష్ పలుమార్లు సంబంధిత అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశమై సమీక్షించారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కోసం జిల్లాలో మొత్తం 13 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రమైన వికారాబాద్‌లో 7 కేంద్రాలు, పరిగిలో 2 కేంద్రాలు, తాండూరులో 4 కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసేందుకు 5468 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, జిల్లాలో గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు.



వికారాబాద్ కూరగాయల మార్కెట్‌లో రైతుల ఇబ్బందులు

మోస్తరు నుంచి భారీ వర్షం

వికారాబాద్/బషీరాబాద్/ఘట్‌కేసర్, జూన్ 8 : మృగశిర కార్తె రోజు వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పలు చోట్ల వాన దంచి కొట్టింది. వికారాబాద్ జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం చినుకులతో ప్రారంభమైన వర్షం జోరు వానగా మారింది. దీంతో రోడ్లన్ని జలమయం కాగా రైతులు సంతోషం వ్యక్తం చేశారు. వికారాబాద్ కూరగాయల మార్కెట్‌లోకి వర్షం నీరు చేరింది. రైతులు, వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. జిల్లా కేంద్రంలోని డ్రైనేజీలు పొంగిపొర్లడంతో రహదారులు దర్గంధంగా మారాయి. బషీరాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. శుక్రవారం మధ్య రాత్రి రెండు, మూడు గంటల పాటు కురిసిన వర్షానికి 42.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ వై.వెంకటేష్ తెలిపారు. కురిసిన వర్షం నీరు గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో రోడ్లపై పారడంతో చిన్నపాటి చెరువులు, నీటి కుంటలను తలపించాయి. మట్టి రోడ్లు చిత్తడిగా మారాయి. నవాల్గ, మాసన్‌పల్లి, కాశీంపూర్, గొట్టిగఖుర్దు తదితర చెరువుల్లోకి వరదనీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వరదనీరు పారింది.



ఘట్‌కేసర్‌లో కురుస్తున్న వాన

వామ్మో..జూన్

పిండేస్తున్నారు..

- తల్లిదండ్రుల్లో మొదలైన ఆందోళన
- చదువుకోసం అప్పుల వేట
- కార్పొరేట్ బడుల్లో భారీగా ఫీజుల పెంపు
- భారంగా మారిన స్కూల్ ఫీజుల భారం
- బెంబేలెత్తిపోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మరో మూడు రోజుల్లో బడిగంట మోగనుంది. ఇన్ని రోజులు ఆటాపాటల్లో మునిగిన విద్యార్థులు ఇక బడి బాట పట్టనున్నారు. ఈనెల 12న బడులు తెరుచుకోనుండటంతో తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. జూన్ అంటేనే భయపడుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులను అడ్డగోలుగా పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర భారం మోపుతున్నాయి. డబ్బే ధ్యేయంగా విద్యా విలువలను తుంగలోకి తొక్కుతూ తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జూన్8) : వేసవి సెలవులు ముగియనున్నాయి. ఆటాపాటల్లో మునిగిన విద్యార్థులు ఇక బడిబాట పట్టనున్నారు. ఈనెల 12వ తేదీన పాఠశాలలు తెరుచుకోనుండటంతో తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. జూన్ నెల పేరు వింటేనే హడలి పోతున్నారు. ఇప్పుడిప్పుడే తొలకరి వర్షాలు కురియడం... ఇదే సమయంలో ఎరువులు, విత్తనాల కొనుగోలుకు పెట్టుబడి.. ఇదే సమయంలో పిల్లలను బడుల్లో చేర్పించడం, పిల్లల ఫీజులు, పుస్తకాలు, డ్రెస్సులు, ఇతర సామగ్రి కొనుగోలు వంటి విషయాల్లో ఆందోళనతో ఉన్నారు. ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉన్న తల్లిదండ్రులు చదువుల ఖర్చుల లెక్కలేసుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలు, కార్పొరేట్ స్కూళ్లలో అడ్డూ అదుపు లేకుండా పెరిగిన ఫీజులను చూసి జడుసుకుంటున్నారు.

పెంచేస్తున్న ఫీజులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రతీ ఏడాది ప్రైవేట్ పాఠశాలల్లో ఏదో కొత్తదనమంటూ ఫీజులను పెంచేస్తున్నారు. పాఠశాలల మధ్య ఎంత పోటీ ఏర్పడుతున్నా ఫీజుల విషయంలో మాత్రం అందరూ కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించకపోవడం, ఉపాధ్యాయుల కొరత తీర్చకపోవడం వంటి కారణాలతో పాటు కొందరు ఉపాధ్యాయులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. మరికొంతమంది ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్ వంటి ఇతర వ్యాపారులు చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల్లో దురాభిప్రాయం ఏర్పడింది. పేదవారైనా సరే తమ పిల్లలను మంచి చదువులు చదివించాలనే ఉద్దేశంలో ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్డగోలుగా ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులపై తీవ్ర భారం మోపుతున్నారు. వారి జేబులను ఖాళీ చేస్తున్నాయి. టెక్నో, గ్రామర్, మోడల్, కాన్సెప్ట్ వంటి తోకపేర్లు తగిలించుకుని ప్రచారంలో దూసుకుపోతున్నాయి. ఏటా 20-30 శాతం ఫీజులు పెంచుతున్నా ప్రభుత్వం కానీ.. అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నియంత్రణ కరువు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు రెండు వేలకు పైగా ఉన్నాయి. వీటిలో విద్యా వ్యాపారం అడ్డూఅదుపు లేకుండా పోతోంది. స్టేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ తదితర బోర్డుల పేరిట ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారుల నియంత్రణ మచ్చుకైనా కనిపించడం లేదు. నాణ్యమైన విద్యాబోధన, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని నమ్మబలుకుతూ ఎక్కువగా ఫీజులను వసూలు చేస్తున్నాయి.

నిబంధనలు పాటించాలి

విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. ఇప్పటికే అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఎక్కడైనా ఫీజుల కోసం బలవంతం చేస్తే ఫిర్యాదు చేయాలి. ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే ఫీజు తీసుకోవాలి. లేదంటే చర్యలు తప్పవు.

సుశీందర్‌రావు, జిల్లా విద్యాధికారి

ఫీజులు పెంచేసిన కార్పొరేట్ స్కూళ్లు


ఉమ్మడి జిల్లాలోని శ్రీచైతన్య, నారాయణ వంటి స్కూళ్ల యాజమాన్యాలు తమ విద్యా సంస్థల్లో 30-40 శాతం మేర ఫీజులను పెంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. త్వరలో విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ముందస్తు ఫీజులు చెల్లించాలని, రాయితీలు ఇస్తామని ప్రకటించడంతో పాటు పుస్తకాలు, యూనిఫామ్స్, స్టేషనరీ కొనుగోలు చేయాలని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

బ్యాగులు, షూస్.. అన్నీ భారమే

మార్కెట్‌లో పిల్లలకు సంబంధించిన పుస్తకాలు బ్యాగులు, వాటర్ బాటిళ్లు, షూస్, ఇలా అన్ని రకాల వస్తువుల ధరలు పెరడగం పేరెంట్స్‌కు భారంగా మారింది. తోటి పిల్లలు రకరకాల వస్తువులు తెచ్చుకుంటే తమ పిల్లలకు ఏది తక్కువ కాకూడదన్న భావనతో ఉన్న తల్లిదండ్రులు పిల్లలకు కావాల్సిన అన్ని వస్తువులు ఖరీదు ఎంతైనా సరే కొనుగోలు చేసి ఇస్తున్నారు. మార్కెట్‌లో అన్ని వస్తువుల ధరలు పెరగడంతో తల్లిదండ్రులు భారంగా భావిస్తున్నారు. జూన్ అంటేనే భయపడుతున్నారు. పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు బ్యాగులను కూడా తమ వద్దనే కొనాలనే నిబంధనలు విధిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పని పరిస్థితుల్లో అక్కడే కొనాల్సి వస్తుంది.

ఫీజుల వివరాలు తరగతి	ప్రైవేట్ స్కూల్ (రూ.వేలల్లో)	కార్పొరేట్‌స్కూల్ (రూ.వేలల్లో)	సీబీఎస్ఈ (రూ. వేల నుంచి లక్షల్లో)
నర్సరీ	15-20	30-40	60- 2.20
ప్రీ ప్రైమరీ-1(ఎల్‌కేజీ)	18-25	35-55	70- 2.0
ప్రీ ప్రైమరీ-2(యూకేజీ)	20-32	38-58	75-2.0
క్లాస్ 2 నుంచి క్లాస్ 4	25-35	40-60	80-2.50
క్లాస్ 5 నుంచి క్లాస్ 6	30-45	45-65	85 -2.50
క్లాస్ 7 నుంచి క్లాస్ 9	35-50	75-90	90-2.80
10వ తరగతి	40-60	95-1.20	95 -3.40

ఒక్కో విద్యార్థిపై ఖర్చు (రూపాయల్లో)	
పుస్తకాలు	5,000-7,000
రెండు జతల యూనిఫాం	2,000-2,500
రెండు జతల షూస్	700-1,000
ట్రాన్స్‌పోర్టు చార్జి	2,000-9,000
స్కూల్ బ్యాగ్	500-700
టిఫిన్ బాక్స్, బాటిల్స్	250-500
స్టేషనరీ ఖర్చులు	200-500





కర్మకాండకు వెళుతూ..
రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

కొడంగల్‌రూరల్, జూన్ 8 : బంధువుల ఇంట్లో కర్మకాండకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. బషీరాబాద్ మండలం దామర్‌చెడ్ గ్రామానికి చెందిన కుమ్మరి శివాజీ(40), అనిత(38)భార్యాభర్తలు. చేవెళ్ల మండలంలోని కుప్పగిరి గ్రామంలో బంధువుల ఇంట్లో శనివారం కర్మకాండ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై ఆలూరు నుంచి శుక్రవారం రాత్రి బయలుదేరారు. ఈ క్రమంలో కొడంగల్ మండలంలోని చిట్లపల్లి గేటు దగ్గర రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను బైక్ వెనక నుంచి ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శివాజీ సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో
చంద్రబాబుకు భారీ భద్రత

- ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు రాక
- నేరుగా రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్లిన బాబు
- రామోజీరావు భౌతిక కాయానికి నివాళి



ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వస్తున్న చంద్రబాబు నాయుడు

శంషాబాద్ రూరల్, జూన్ 8: రామోజీరావు మరణంతో టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్‌కు కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. రామోజీరావు మరణ వార్త విన్న చంద్రబాబు ఢిల్లీ నుంచి మధ్యాహ్నం 1:30గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. కాగా చంద్రబాబుకు పోలీసు ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి కానున్న నేపథ్యంలో ఆయనకు భద్రతను పెంచారు. చంద్రబాబు ఎయిర్‌పోర్టు నుంచి తన కుటుంబ సభ్యులతో నేరుగా రామోజీ ఫిల్మ్‌సిటీకి వెళ్లి రామోజీరావు పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఎన్నికల ఫలితాల అనంతరం చంద్రబాబు మొదటిసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు.

రాజీ మార్గమే రాజమార్గం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



లోక్‌ఆదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు, ఎస్పీ కోటిరెడ్డి తదితరులు

వికారాబాద్ , జూన్ 8: రాజీ మార్గమే రాజ మార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా లో మొత్తం 2,652 కేసులు రాజీ అయ్యాయని తెలిపారు. వికారాబాద్‌లో 636 కేసులు, పరిగి కోర్టులో 461 కేసులు, తాండూరు కోర్టులో 1,216 కేసులు రాజీతో పరిష్కారమయ్యాయన్నారు. ప్రతి మూడు నెలలకోసారి మెగా లోక్‌అదాలత్ ఉంటుందని ఇందులో రోడ్డుప్రమాదాల కేసులు, డ్రంకెన్‌డ్రైవ్ కేసులు, భూతగాదాల కేసులు, భార్యాభర్తల కేసులు, చిన్నచిన్న కొట్లాట కేసులు, బ్యాంక్ అప్పుల కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. అన్నదమ్ముల మధ్య భూమి సమస్య ఉన్నప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలి కానీ, దానిని సాగదీసి పంతాలకు పోయి కోర్టుల చుట్టూ తిరిగి బంధాలను దూరం చేసుకుని సమయం వృథా చేసుకోవద్దన్నారు. మధ్యవర్తుల మాటలను పట్టుకుని చిన్నచిన్న తగాదాలు పెద్దవిగా చేసుకోవద్దన్నారు. ఈ జాతీయ లోక్‌అదాలత్ ద్వారా రాజీ పడినట్లు అయితే ఇరు పక్షాలు గెలిచినట్లేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి శీతల్, అదనపు న్యాయమూర్తి శ్రుతిదూత, ఎస్పీ కోటిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ ఉపాధ్యక్షుడు సయ్యద్ కయ్యూమ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్ అన్వేష్ సింగ్, సమీనబేగం, న్యాయవాదులు, శంకరయ్య, నాగరాజు శ్రీనివాసరావు, వెంకటేష్, బి.నారాయణ, రాము, రాజు, తులసీరామ్, పోలీసు అధికారులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కులకచర్ల, జూన్ 8: పెండింగ్‌లో ఉన్న వేతనాలు అందించాలని పారిశుధ్య కార్మికులు రోడ్డెక్కారు. తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం పారిశుధ్య కార్మికులు బైఠాయించారు. పది నెలలుగా వేతనాలు రావడం లేదని ఆందోళన చేపట్టారు. వేతనాలు లేక తమ కుటుంబాలు పస్తులుంటున్నాయని వాపోయారు. డబ్బులులేక కిరణాకొట్టు వారు నిత్యావసర వస్తువులు ఉద్దెర ఇవ్వడంలేదన్నారు. వీరికి మద్దతుగా గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్

● చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య

చేవెళ్ల, జూన్ 8 : రాజీమార్గమే రాజమార్గమని, కేసుల సత్వర పరిష్కరం కోసమే జాతీయ లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్‌లు అన్నారు. శనివారం చేవెళ్ల కోర్టు ఆవరణలో జాతీయ లోక్అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా, మొత్తం 1,833 కేసులు పరిష్కరించి, రూ.10,33,080 జరిమానా విధించినట్లు తెలిపారు. రిటైర్డ్ జడ్జి సాంబశివ రావు, సీఐలు లక్ష్మారెడ్డి, అభిబుల్లాఖాన్, వీరబాబు, కాంతారెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్సై విఠల్‌రెడ్డి, ఏపీపీ సుశీలా మాయారీ, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యానందం, ఉపాధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, అధికారులు, న్యాయవాదులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దశరథ రామయ్య

టీడీపీ చూపు.. తెలంగాణ వైపు

● రాష్ట్రంలో సైకిల్ సవారీకి వ్యూహాత్మకంగా అడుగులు ● అసంతృప్తి నేతలకు 'వల'.. 'స్థానిక' సమరంలో పోటీకి సన్నద్ధం
● పార్టీ అధినేత సూచనతో నాయకుల ప్రణాళికలు! ● ఏపీలో ఘనవిజయంతో ఉత్సాహంగా తెలుగు తమ్ముళ్లు..

తాండూరు, జూన్ 8 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో ఎవరూ ఊహించని విధంగా భారీ మెజార్టీతో అధిక సీట్లు సాధించి అధికారంలోకి వచ్చింది. ఎన్డీఏతో జతకలిసి కేంద్రంలోనూ చక్రం తిప్పేందుకు ఎంపీ సీట్లనూ గెలుచుకుంది. దాంతో మళ్లీ తెలంగాణలో సైకిల్ సవారీకి సిద్ధమైనట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. తెలంగాణ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి మంచి ఆదరణ ఉంది. ఇప్పటికీ క్షేత్రస్థాయిలో నాయకత్వం ఉన్న జిల్లాగా వికారాబాద్ జిల్లాకు పేరుంది. జిల్లాలోని పలువురు నేతలతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీకి కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఇప్పటికీ సత్సంబంధాలు ఉన్నాయి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక.. చంద్రబాబు హైదరాబాద్‌లో నిర్వహించే విజయోత్సవ సభ తర్వాత.. పార్టీ పటిష్టతపై దృష్టి సారించనున్నట్లు సమాచారం. రాష్ట్రం విడిపోయి పదేళ్లు దాటినా.. ఇప్పటికీ టీడీపీకి పట్టున్న వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల నేతలు చంద్రబాబును కోరనున్నట్లు సమాచారం. ఏపీ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పోరాడినట్లే తెలంగాణలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిగా ముందుకు వెళ్లి బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు దీటుగా పోటీలో నిలవాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా, ఇదే జరిగితే తెలంగాణలో తెలుగుదేశం పార్టీ మళ్లీ పుంజుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈమేరకు ఈ నెలాఖరులోగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్‌గౌడ్ వికారాబాద్ ప్రాంతానికి చెందిన ఇతర నాయకులు, ఇతర పార్టీల్లో అసంతృప్తి నేతలు, నాయకులు, కార్యకర్తల జాబితాను సిద్ధం చేసేందుకు ప్రణాళికలు తయారు చేయనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే, 2014 కంటే ముందు ప్రజాప్రతినిధులుగా టీడీపీ నుంచి కొనసాగివారితో పాటు ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నవారి జాబితాను కూడా సిద్ధం చేయనున్నట్లు సమాచారం. ఏదిఏమైనా టీడీపీ ఇక్కడ బరిలో నిలిస్తే బీఆర్ఎస్ స్థానాన్ని పూరించేలా కూటమి ఏర్పడే అవకాశాలూ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

దోపిడీ దొంగలతో తల్లీకూతుళ్ల పోరాటం

● కళ్లలో కారం నీళ్లు చల్లి బంగారం అపహరణకు యత్నం
● మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన కుటుంబ సభ్యులపై చైన్‌స్నాచర్ల అఘాయిత్యం
● తీవ్రంగా ప్రతిఘటించడంతో.. బైక్, బ్యాగు వదిలి దౌడుతీసిన దుండగులు
● ఎట్టకేలకు పట్టుబడిన దొంగలు.. ఒకేరోజు మూడు దొంగతనాలు
● ఇంతకుముందు పలు కేసుల్లో జైలుకెళ్లిన వైనం
● గాలింపు చేపట్టి అదుపులోకి తీసుకున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి నగలు


పహాడిషరీఫ్/హైదరాబాద్ సిటీ, జూన్ 8: ఒంటరిగా వాకింగ్‌కు వెళ్లినవారు, శివారు ప్రాంతాల్లో రోడ్డుపై వెళ్తున్న వారిని టార్గెట్ చేసి కారం కలిపిన నీటిని ముఖంపై విసిరి.. ఆ గ్యాప్‌లో చైన్ స్నాచింగ్‌లు, దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా స్నాచర్స్ ఆట కట్టించారు రాచకొండ పోలీసులు. వారి వద్ద నుంచి 8తులాల బంగారం, 30 తులాల వెండి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, డీఐ సుధీర్‌కృష్ణతో కలిసి డీసీపీ సునీతారెడ్డి శనివారం పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. మహేశ్వరం మండలం పరిధిలోని మంఖాల్ గ్రామానికి చెందిన గడ్డమీది కల్పన మే 24న ఉదయం 5 గంటలకు తన కూతుళ్లు లక్ష్మీప్రసన్న, నేహా, కుమారుడు మనీష్‌కుమార్‌తో కలిసి మంఖాల్ నుంచి శంషాబాద్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డులో వాకింగ్‌కు వెళ్లింది. సుమారు 5.50 గంటల ప్రాంతంలో ముఖానికి మాస్కులు, హెల్మెట్‌లు ధరించి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు వారి దగ్గరకు వచ్చారు. అప్పటికే వాటర్ బాటిల్‌లో కారం కలిపిన దుండగులు.. ఒక్కసారిగా కల్పన కళ్లలో కొట్టారు. దాంతో ఆమె కూతుళ్లు, కుమారుడు భయాందోళనకు గురయ్యారు. వెంటనే దుండగులు కల్పన మెడలోని బంగారు గొలుసు లాక్కోవడానికి యత్నించారు. వెంటనే కల్పన, కూతురు లక్ష్మీప్రసన్నలు ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా దొంగలకు ఎదురుతిరిగారు. పారిపోవడానికి ప్రయత్నించిన దొంగలతో పోరాడారు. రెచ్చిపోయిన దొంగలు కర్రతో తల్లీకూతుళ్లను కొట్టారు. దాంతో వారి నదుటిపై గాయాలయ్యాయి. అయినా, పట్టువిడవకుండా గట్టిగా కేకలు వేస్తూ తిరగబడి బైక్ తాళాలు లాక్కున్నారు. ఇక లాభం లేదనుకున్న దొంగలు బైక్‌ను, వారివెంట తెచ్చుకున్న బ్యాగును అక్కడే వదిలేసి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కల్పన, ప్రసన్నలను ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు పహాడిషరీఫ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా, మహేశ్వరం డివిజన్‌లో ఒకేరోజు మూడు చైన్‌స్నాచింగ్ కేసులు నమోదవడంతో రాచకొండ సీపీ ఆదేశాల మేరకు డీసీపీ సునీతారెడ్డి మూడు ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దింపారు. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక పోలీసులు కల్పన కేసులో బైక్, బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు టెక్నికల్ ఆధారాలు దొరికాయి. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, సిబ్బంది సదీర్, వెంకటేశ్వర్లు, రైల్వే పోలీసుల సహకారంతో ఇద్దరు ఘరానా దొంగలైన మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన టక్ షమ్‌షీర్‌సింగ్, నిజామాబాద్‌కు చెందిన దండ్ల బాబు అలియాస్ బాబు బాలాజీ గైక్వాడ్‌లను అదుపులోకి తీసుకొన్నారు.

పటాన్ చెరులో బైక్ చోరీ చేసి..

కాగా, పట్టుబడిన నిందితులను విచారించగా పటాన్ చెరులో ద్విచక్ర వాహనం దొంగతనం చేసి ఒకేరోజు పహాడీషరీఫ్‌లో కల్పన మంగళ సూత్రం, మహేశ్వరంలో గొర్ల కాపరి కంట్లో కారం నీళ్లు చల్లి వెండి, బంగారం వస్తువులు, కందుకూరులోని రాచటూర్‌లో మహిళ కంట్లో కారం నీళ్లు చల్లి మంగళసూత్రం లాక్కొని పారిపోయినట్లు తేలింది. గతంలో వీరు పలు దోపిడీ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చారు. 2021 నుంచి పరారీలో ఉన్నారు. ఇప్పటివరకు వీరిపై 82 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన మహేశ్వరం ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, క్రైం టీమ్‌లను డీసీపీ అభినందించారు. దోపిడీ దొంగలతో ధైర్యంగా పోరాడిన కల్పన, ప్రసన్నలను డీసీపీ అభినందించారు.

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం

● హైకోర్టు పర్మినెంట్ స్టే ఉన్నా పట్టించుకోని వైనం
● విజయ విద్యాలయ క్రీడాస్థలంపై కొందరి కన్ను
● రూ.10 కోట్ల విలువైన స్థలానికి ఎసరు
● గతంలోనే ప్రభుత్వ భూమిగా తేల్చిచెప్పిన కోర్టు


కోర్టు ఆదేశం మేరకు కలెక్టర్‌కు తహసీల్దార్ నివేదించిన లెటర్


హైస్కూల్ ప్లేగ్రౌండ్ తమదంటూ పాతిన బోర్డు

తాండూరు, జూన్ 8: పట్టణం నడిబొడ్డులో ఉన్న రూ. 10కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమవుతోంది. సర్వేనంబర్ 111లో గల విజయ విద్యాలయ హైస్కూల్‌కు ఆనుకొని సుమారు 2వేల గజాల భూమి ఉంది. గతంలో పాఠశాలకు ఆటస్థలం కొరకు ప్రభుత్వ ఆ భూమిని వాడుకునేందుకు ఇచ్చింది. అయితే, ఆ భూమి తమదని, హక్కుదారులమని 2015 సంవత్సరంలో విజయ విద్యాలయ హైస్కూల్ యాజమాన్యంలోని కొందరు వ్యక్తులు తెలిపారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్లాట్లుగా చేసి విక్రయించే యత్నం చేశారు. పూర్వవిద్యార్థులు, స్థానికులు ముందుకొచ్చి కోర్టును ఆశ్రయించడంతో అప్పట్లోనే హైకోర్టు పర్మినెంట్ స్టే ఇచ్చింది. రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ స్థలమని తేల్చేశారు. కోర్టుకు కూడా నివేదిక సమర్పించారు. అయితే, పదేళ్ల తర్వాత మళ్లీ ఈ అంశం తెరపైకి వచ్చింది. సర్వే నంబర్ లేకుండా డ్యాకుమెంట్లు సృష్టించి విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన ప్లేగ్రౌండ్‌గా పేర్కొన్న ప్రభుత్వ స్థలం తమదేనంటూ గ్రౌండ్‌ను క్లీనింగ్ చేసి స్థలం చుట్టూ సిమెంట్ స్తంభాలు పాతి బోర్డును పాతారు. ఇప్పటికే ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నందున స్థానికులు, పూర్వవిద్యార్థులు కోర్టు ధిక్కారం కింద హైకోర్టును తిరిగి ఆశ్రయించాలని నిర్ణయించారు. అయితే, విజయ విద్యాలయ హైస్కూల్ యాజమాన్యంలోని కొందరు వ్యక్తులు ఈ స్థలం తమదేనంటూ.. గతంలో కోర్టును ఆశ్రయించగా డిస్మిస్ చేసింది. అది ప్రభుత్వ స్థలమని, 2015లో రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. అయితే ఈ స్థలం విషయం కొలిక్కి తెచ్చేందుకు రెవెన్యూ అధికారులు అందుబాటులో లేరు. లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో బిజీగా ఉన్నామని, తర్వాత పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

ప్లేగ్రౌండ్ స్థలాన్ని రక్షించుకుంటాం



విజయ విద్యాలయ హైస్కూల్ ప్లేగ్రౌండ్ స్థలం కబ్జాను అడ్డుకుంటాం. గతంలో ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా అడ్డుకున్నాం. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ స్థలమే. కొందరు కావాలనే తమదని చెప్పుకుంటున్నారు.

- పరిమళ, మాజీ కౌన్సిలర్

గతంలో హైకోర్టు స్టే ఇచ్చింది



పూర్వవిద్యార్థులు, స్థానికులం కలిసి స్థలం కబ్జా కాకుండా గతంలో హైకోర్టును ఆశ్రయించాం. పిటిషన్ దారుడిగా నేనే కోర్టులో కేసు ఫైల్ చేశా. ఇప్పటికీ స్టే ఉంది. కోర్టు ధిక్కారం కింద తిరిగి హైకోర్టుకు వెళ్తాం.

- లొంక పాండు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ (విజయ విద్యాలయ)

కుంగుతున్న కల్వర్టు.. పొంచి ఉన్న ప్రమాదం



కొద్ది రోజులుగా మేడ్చల్ మండలంలో కురుస్తున్న అడపాదడపా వర్షాలకు డబిల్‌పూర్-నూతన్‌కల్ ఆర్అండ్‌బీ రోడ్డుపై ఉన్న కల్వర్టు కుంగిపోయింది. ఫలితంగా వాహనదారులు భయపడుతూ కల్వర్టు దాటాల్సిన పరిస్థితి నెలకొంది. కల్వర్టు కుంగి కల్వర్టు పక్క పెద్ద గుంతలు ఏర్పడటంతో స్థానికులు రోడ్డుకు ఒకవైపు హెచ్చరికగా రెడ్ బారికేట్‌ను ఏర్పాటుచేశారు. సంబంధిత అధికారులు మాత్రం కల్వర్టు మరమ్మతు గురించి పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులుగా కల్వర్టు రోజుకింత కుంగుతుండటంతో పెద్ద వాహన దారులు రోడ్డుపై ప్రయాణించటానికి జంకుతున్నారు. డబిల్‌పూర్-నూతన్‌కల్ గ్రామాలకు మధ్య ఉన్న ఇస్కాన్ ఆలయం వద్ద వర్షపు నీరు సమీపంలోని చెరువు కుంటలో చేరటానికి ఈ కల్వర్టును ఏర్పాటు చేశారు. అయితే, కాంట్రాక్టర్ నాణ్యత లేకుండా నిర్మించడంతో కల్వర్టు కుంగిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, నిత్యం వందల వాహనాలు నడిచే రోడ్డుపై నిర్మించిన కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేయాలని నూతన్‌కల్, డబిల్‌పూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

- మేడ్చల్ టౌన్, జూన్ 8

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి

ఆదిభట్ల, జూన్ 8 : మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని వేదపురి, బాలాజీనగర్ కాలనీల్లో కౌన్సిలర్లు కుంట్ల మౌనిక ఉదయపాల్‌రెడ్డి, మర్రి అర్చన రాంరెడ్డిలతో కలిసి శనివారం రూ.22 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. నిరంజన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతీ వార్డులో సమస్యలు గుర్తించడం జరిగిందని, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లాంటి మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, మిగతా సమస్యలు దశలవారిగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ యాదగిరి, ఏఈ వీరాంజనేయులు, వర్క్ఇన్‌స్పెక్టర్ జాన్సన్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, రామారావు, పాండు గౌడ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మృగశిర ఎఫెక్ట్.. జోరుగా చేపల విక్రయాలు


పరిగి మార్కెట్‌లో చేపల విక్రయాలు


ఘట్‌కేసర్: బాలాజీనగర్‌లో చేపలు విక్రయాలు

వికారాబాద్, జూన్ 8: మృగశిరకార్తె రోజు వాతావరణంలో మార్పుల కారణంగా చేపలు తినాలని అంటుంటారు. దీంతో శనివారం మార్కెట్లలో చేపలను కొనేందుకు జనం బారులుతీరారు. సాధారణంగా ఏటా మృగశిరకార్తెకు చేపల ధరలు పెరగడం సర్వసాధారణం. అయితే ఈసారి మృగశిర కార్తె శనివారం రావడంతో సాధారణం కంటే ఎక్కువ ధరలకు చేపలను విక్రయించారు. వికారాబాద్ మార్కెట్‌లో కొర్రమీను రూ.600, బంగారు తీగ, రవ్వు, బొచ్చలు రూ.160కే విక్రయించారు.

మర్పల్లి: మండలంలోని కొంశెట్టిపల్లి, రావులపల్లి చెరువుల దగ్గర చేపల కొనుగోలుదారులు బారులుతీరారు. మత్స్యకారులు ఒక రోజు ముందుగానే వలవేసి ఉదయాన్నే చేపలు చెరువులో నుంచి తీయడంతో కొనుగోలు చేసేందుకు మోమిన్‌పేట్, మర్పల్లి, బంటారం మండలాలతో పాటు సదాశివపేట మండలం నుంచి పెద్దఎత్తున కొనుగోలుదారులు తరలివచ్చారు. రౌత చేప సాధారణ రోజుల్లో కిలో రూ.100ఉంటే శనివారం రూ.300కు పైగా పలికింది. స్వచ్ఛమైన నీటిలో స్వచ్ఛమైన చేప అని డబ్బులు లెక్క చేయకుండా కొనుగోలుదారులు చేపలను కొనుగోలు చేశారు.

తాండూరు: మృగశిరకార్తెను పురస్కరించుకుని చేపలకు డిమాండ్ ఉండటంతో తాండూరులో మామూలు రోజుకంటే శనివారం రూ.50ఎక్కువ ధరకు విక్రయించారు. కొర్రమీను కిలో రూ.500, రవ్వులు కిలో రూ.220 పలికింది. మూడు రోజులుగా తాండూరులోని చేపలకు డిమాండ్ తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు.

పరిగి: మార్కెట్‌లో చేపల అమ్మకాలు జోరుగా కొనసాగాయి. చేపలకు డిమాండ్ బాగా ఉండడంతో వ్యాపారస్తులు ఒక్కసారి ధరలను పెంచేశారు. బోచ్చేలు, బంగారుతీగలు, కంషలు మామూలు రోజుల్లో రూ.100 నుంచి రూ.120లోపే ఉండేవి. ప్రస్తుతం కిలో రూ.150 నుంచి రకాలను బట్టి రూ.250వరకు పలికాయి. కొర్రమీనులు మాత్రం కిలో రూ.500ల నుంచి రూ.600ల వరకు పలికింది.

ఘట్‌కేసర్ రూరల్/కీసర: మృగశిర కార్తె సందర్భంగా ఘట్‌కేసర్, కీసర మండ లాల్లో శనివారం జోరుగా చేపల విక్రయాలు చేపట్టారు. ఘట్‌కేసర్ మండలంలోని అంకుశాపూర్ లోతుకుంట వద్ద జోరుగా చేపలు విక్రయించారు. వెంకటాపూర్‌లోని నాడెం చెరువు, తాళ్ళకుంట చెరువుల వద్ద శ్రీ బాలాజీ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేపల విక్రయాలు చేపట్టారు. కిలో కొర్రమీను రూ. 500లు, రవ్వ, బొచ్చలు కిలో రూ.200లకు విక్రయించారు. సాధారణ రోజుల్లో కొర్రమీను కిలో రూ.300, రవ్వ, బొచ్చలు రూ.150లకే విక్రయించేవారు. మృగశిర కార్తె సందర్భంగా చెరువుల వద్ద సందడి నెలకొన్నది. వెంకటాపూర్ తాళ్ళకుంట చెరువు వద్ద మత్స్యకారులు బారికేడ్లు ఏర్పాటుచేసి చేపలు విక్రయించారు. మండలంలోనే అతిపెద్ద చెరువైన ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో ఇటీవల కలుషిత నీరు చేరి చేపలు మృతిచెందడంతో మృగశిర రోజు చేపలు పట్టలేదు. చేపల కొనుగోలు చేసిన తరువాత వాటిని శుభ్రం చేయడానికి ప్రత్యేకంగా క్లీనింగ్ అండ్ కట్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కిలో చేపను క్లీన్‌చేసి కట్టింగ్ చేస్తే రూ.30 తీసుకుంటున్నారు. కీసర మండల కేంద్రంలో చేపల విక్రయాలు జోరుగా సాగాయి.

మూడుచింతలపల్లి: మండలంలో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. గ్రామాల్లోని చెరువుల వద్ద చేపల విక్రయకేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిలాడాయి. మాములు రోజుల్లో చేపల ధరల కంటే ఎక్కువ ధరలకు చేపలను విక్రయించారు. మామూలుగా మత్స్యకారులు కొర్రమీను చేప కిలోధర రూ.450 నుంచి రూ.500, బొచ్చ, రవ్వ రూ.150 నుంచి రూ.200 విక్రయించేవారు. మృగశిరకార్తె కావడంతో రూ.50నుంచి రూ.100 చొప్పున అధిక ధరలకు చేపలను విక్రయించారు.


మర్పల్లి: చెరువులో నుంచి చేపలు పట్టుకొస్తున్న మత్స్యకారుడు

నేడు చేపలకు మరింత డిమాండ్


శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద మత్స్యకారులు విక్రయిస్తున్న చేపలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలో పరిధిలో శనివారం మృగశిర కార్తె సందర్భంగా చేపల విక్రయాలు అంతంత మాత్రంగానే జరిగాయి. చేపల ధరలు సైతం సాధారణంగానే ఉన్నాయి. సాధారణ రోజుల్లో బొచ్చ, రవ్వులు రూ, 180, కొర్రమీను రూ, 400 ధర ఉండగా మృగశిర సందర్భంగా బొచ్చ, రవ్వులు రూ,200, కొర్రమీను రూ500చొప్పున విక్రయాలు జరిగాయి. ఈసారి మృగశిర కార్తె శనివారం వచ్చినందున చేపల విక్రయాలు ఆశించిన స్థాయిలో జరగలేదని పలువురు చేపల విక్రయదారులు వాపోయారు. హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి పక్కన పలుచోట్ల చేపల విక్రయ దుకాణాలు వెలసినప్పటికీ దుకాణాల వద్ద పెద్దగా సందడి కనిపించలేదు. ఆదివారం(నేడు) చేపల విక్రయాలకు గిరాకీ పెరిగే అవకాశాలు ఉన్నాయి.

కీసర రూరల్: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో చేపల విక్రయాల్లో జోరు కనిపించడం లేదు. శనివారం రోజున జనాలు ఆధ్యాత్మికంగా ఉండి మాంసాహారానికి దూరంగా ఉంటారు. దీంతో మృగశిర కార్తెవచ్చినప్పటికీ చేపలు కొనుగోలు చేసేందుకు జనాలు ఆసక్తి చూపలేదు. గ్రామాల్లో చెరువుల వద్ద చేపల కొనుగోళ్లతో సందడి నెలకొన్నప్పటికీ ఇక్కడ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. నాగారంలో చేపల దుకాణం ఏర్పాటు చేసిన ఓ మహిళను సంప్రదించగా రవులు, బొచ్చెలు రూ.200, కొరమీను రూ.650లకు విక్రయిస్తున్నామని తెలిపింది. శనివారం కావటంతో గిరాకీ లేదని వాపోయింది. కాగా, ఇక్కడ చేపలకు ఆదివారం గిరాకీ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

శామీర్‌పేట: మృగశిర కార్తె సందర్భంగా శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద శనివారం మత్స్యకారులు జోరుగా చేపలను విక్రయించారు. చెరువులో మత్స్యకారులు చేపలను పట్టి చెరువు వద్ద పెద్ద, పెద్ద కుప్పలుగా పోసి విక్రయించారు. మృగశిర సందర్భంగా బొచ్చ, రవ్వ చేపలను కిలో రూ.250కు, మామూలు రోజుల్లో అయితే రూ.200లకు విక్రయించారు. కాగా ఈచెరువులో నుంచి మత్స్యకారులు ఒక్కో చేప రెండు కిలోల నుంచి దాదాపు 10కిలోల వరకు పట్టి విక్రయించారు. కాగా మృగశిర సందర్భంగా శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు మత్స్యకారులు జనానికి దాదాపు వెయ్యి కిలోల వరకు విక్రయించినట్లు తెలిసింది. కాగా కొర్రమీను ఈ చెరువులో దొరకక విక్రయానికి పెట్టలేదు.

క్రైం కార్నర్

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కులకచర్ల, జూన్ 8: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రానికి చెందిన బషీర్(56) వికారాబాద్‌లో మేస్త్రీ పని చేస్తున్నాడు. గత నెల 21న అతడి సొంత గ్రామమైన లింగాలకు వెళ్లి వికారాబాద్‌కు తన తండ్రి నిరంజన్‌తో కలిసి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో కులకచర్ల మండలంలోని కామునిపల్లి గ్రామసమీపంలో అదుపుతప్పి పడగా గాయాలయ్యాయి. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యశీలారెడ్డి తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

పూడూరు, జూన్ 8: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపిన వివరాలిలు ఇలా ఉన్నాయి. పూడూరుకు చెందిన పిరంగి కాశయ్య కుమారుడు పిరంగి మహేష్(24) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం ఇంట్లో గొడవపడి మనస్తాపంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం


రహీష బేగం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 8: ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో ఓ మహిళ అదృశ్యమైనట్లు సీఐ సైదులు తెలిపారు. మున్సిపలిటీ పరిధి బ్రూక్‌బాండ్ కాలనీకి చెందిన రహీష బేగం(32) ఈనెల 7వ తేదీన ఘట్‌కేసర్‌లోని ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి సాయంత్రం వరకూ తిరిగిరాలేదు. ఆమె కుటుంబసభ్యులు ఆసుపత్రి వద్ద, తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభ్యంకాలేదు. ఆమె మానసిక స్థితి బాగాలేదని, గతేడాది ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చికిత్స అందించినట్లు తెలిపారు. రహీషబేగం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చిన్న వార్వాల్‌లో యువతి..

కులకచర్ల, జూన్ 8: యువతి అదృశ్యమైన ఘటన చౌడాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పాలమూర్ జిల్లా గండీడ్ మండలం చిన్న వార్వాల్ గ్రామానికి చెందిన మల్లేశ్ కూతురు మహాలక్ష్మి(19) చౌడాపూర్ గ్రామంలో ఉన్న పిన్ని చెన్నమ్మ దగ్గరికి వారం రోజుల కిందట వచ్చింది. అయితే, చెన్నమ్మ శుక్రవారం మహాలక్ష్మిని ఇంటి దగ్గరే ఉంచి పాలమూర్ ఆసుపత్రికి వెళ్లింది. రాత్రి వచ్చి చూడగా ఆమె ఇంటి దగ్గర లేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం చెన్నమ్మ ఫిర్యాదు మేరకు యువతి అదృశ్యమైన ఘటనలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

పశువులను కబేళాలకు తరలిస్తున్న వ్యక్తిపై కేసు


కబేళాలకు తరలుతున్న పశువులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 8: పశువులను తాళ్లతో కట్టేసి కబేళాలకు తరలిస్తున్న ఓ వ్యక్తిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మండలంలోని అవుషాపూర్ కేపాల్ వద్ద బక్రీద్ సందర్భంగా ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. శనివారం సాయంత్రం అశోక్ లేల్యాండ్ వాహనాన్ని ఆపి సోదా చేశారు. అందులో తాళ్లతో కట్టేసి నీళ్ల లేకుండా 3పశువులను తరలిస్తుండగా గుర్తించారు. యాదాద్రీ-భువనగిరి జిల్లా, రామన్నపేటకు చెందిన అశోక్ లైల్యాండ్ డ్రైవర్ మహ్మద్ ఇస్మాయిల్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. సంగారెడ్డికి పశువులను తరలిస్తున్నట్లు తెలిపారు. పశువులను నగరంలోని జియాగూడ గోశాలకు తరలించారు. ఈ మేరకు ఇస్మాయిల్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో హైవేపై వ్యక్తి హల్‌చల్


రోడ్డుపై హల్‌చల్ చేస్తున్న వ్యక్తి

మేడ్చల్ టౌన్, జూన్ 8: మద్యం మత్తులో ఓవ్యక్తి షర్టు విప్పి జాతీయ రహదారి పై హల్‌చల్ చేశాడు. ఫలితంగా నిత్యం వాహనాలతో కిక్కిరిసి ఉండే రహదారిపై మరింత వాహనాలు నిలిచిపోయాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ జాతీయ రహదారిపై శనివారం ఓవ్యక్తి మద్యం మత్తులో తన షర్టును తీసేసి రోడ్డుమీద పడుకున్నాడు. అతడు ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని భావించిన స్థానికులు అతడిని రోడ్డుపైనుంచి పక్కకు తీసుకురావటానికి ప్రయత్నించారు. అయినా అతడు అతడు వినిపించుకోకుండా రోడ్డుకు అడ్డంగా పడుకున్నాడు. అయినప్పటికీ వినకపోవటంతో 100కు డయిల్ చేయగా పోలీసులు అతన్ని రోడ్డు పక్కన కూర్చోబెట్టారు. అనంతరం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

మాజీ మంత్రి జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు


ఆర్థిక సాయం చేస్తున్న మాజీ మంత్రి సతీమణి ప్రమీల

వికారాబాద్, జూన్ 8: మాజీ మంత్రి, భృంగి ఇంటర్నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ చంద్రశేఖర్ జన్మదినం సందర్భంగా కుటుంబసభ్యులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఏసీఆర్ భృంగీ విద్యాసంస్థల కార్యదర్శి ఎ.ప్రమీల చంద్రశేఖర్, డాక్టర్ ఏ.చంద్రప్రియలు మాజీ మంత్రి వర్యులు డాక్టర్ ఏ చంద్రశేఖర్ జన్మదినం సందర్భంగా డాక్టర్ ఏ.చంద్రప్రియా వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు, భృంగి విద్యాసంస్థల కార్యదర్శి ఎ.ప్రమీల కొంపల్లిలో గల వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఆనంతరం డాక్టర్ ఏ.చంద్రప్రియా ధన్నారంలో స్వామి వివేకానంద గురుకుల అనాథ పాఠశాలలో అన్నదానం చేశారు. భృంగీ కళాశాల డైరెక్టర్ మరాఠి శివప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి పాల్గొన్నారు.

గాలొచ్చినా.. వానొచ్చినా కరెంట్ కట్

బషీరాబాద్, జూన్ 8: మండల ప్రజలకు కరెంటు కష్టాలు తప్పడంలేదు. వర్షం వస్తే చాలు ట్రాన్స్‌కో అధికార సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. గతంలో ఎంతటి ఈదురు గాలులతో కూడిన వర్షం పడినా కరెంట్ సరఫరా నిలిపివేసేవారు కాదని, ప్రస్తుతం చీటికి మాటికి గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్న పరిస్థితులు దాపరించాయని వినియోగదారులు వాపోతున్నారు. రాత్రుళ్లు గంటల తరబడి కరెంట్ లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సివస్తోందని వాపోతున్నారు. వర్షాకాలం విద్యుత్ అంతరాయం లేకుండా ఆ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొడంగల్ నియోజకవర్గానికి మహర్దశ

● రూ.170 కోట్ల ఆర్ అండ్ బీ నిధులతో రోడ్లు


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, జూన్ 8: నియోజకవర్గానికి మహర్దశ వచ్చిందని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ అన్నారు. నియోజకవర్గానికి మంజూరైన రూ.170 కోట్ల నిధులతో ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగియడంతో పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హస్నాబాద్ నుంచి నీటూర్ గేటు వరకు రూ.26 కోట్లు, పర్సాపూర్ నుంచి పాత కొడంగల్ తండా వరకు రూ.11 కోట్లు, లింగంపల్లి నుంచి దుద్యాల వరకు రూ.28 కోట్లు, కుదురుమళ్ల నుంచి పోలెపల్లి మీదుగా దాదాపూర్ వరకు రూ.50 కోట్లు, అంగడిరైచూర్ గేటు నుంచి రుద్రారం వరకు రూ.15 కోట్లు, రావుల్‌పల్లి నుంచి దౌల్తాబాద్ వరకు రూ.40 కోట్లు నిధులు మంజూర్‌తో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: దుద్యాల గ్రామంలో రూ.62 కోట్లతో చేపట్టే డబుల్ రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. బొంరాస్‌పేట్ మండలం లింగన్‌పల్లి గేటు నుంచి లింగన్‌పల్లి, సాగారం తండా మీదుగా దుద్యాల వరకు రూ.12 కోట్లు, కుదురుమళ్ల నుంచి ఆలేడ్, దుద్యాల మీదుగా హకీంపేట, పోలెపల్లి, దోమ మండలం దాదాపూర్ చివరి వరకు రూ.50 కోట్లతో పనులు చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా పార్లమెంట్ ఎన్నికల్లో హకీంపేట గ్రామం నుంచి మెజారిటీ రాకపోవడంపై ఆ గ్రామ నాయకులను పార్టీ నియోజకవర్గ తిరుపతిరెడ్డి ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఆవుటి శేఖర్, నర్సింహులుగౌడ్, మెరుగు వెంకటయ్య, పోలెపల్లి వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు భరోసా

బొంరాస్‌పేట్: బాపల్లి తండా గ్రామ పంచాయతీలో హరిచందర్‌కు మంజూరైన రూ.1,30,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి శనివారం అందజేశారు.

ఘనంగా అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వార్షికోత్సవం

తాండూరు, జూన్ 8: తాండూరు పట్టణంలో అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వికారాబాద్ జిల్లాకు చెందిన 80 మంది కవులు రచించిన పద్యాలు, గేయాలు మణిపూసల రచన కవితలతో కూడిన అనంత సంకల్పన గ్రంధాన్ని ప్రకృతి పరిమళం అనే మణిపుసులు కావ్యాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన కవులను రయితలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. అనంత సాహిత్య గౌరవ అధ్యక్షుడు నర్సింహులు, ముఖ్య అతిథిగా పాల్గొని శతావధాని అంజయ్య, రంగస్థలం నటుడు అంజయ్య గౌడ్, జీవన సాఫల్య పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి నామోజు బాలా చారి, ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వఆచార్యులు డాక్టర్ బాలయ్య, డాక్టర్ మల్లారెడ్డి, డాక్టర్ చంద్రప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

'గృహజ్యోతి' అమలు

తాండూరు, జూన్ 8: ఎన్నికల కోడ్ ముగియడంతో గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చింది. 200 యూనిట్స్ లోపు విద్యుత్ వాడకం దారులకు జీరో బిల్లుల జారీ ప్రక్రియను విద్యుత్‌శాఖ అధికారులు చేపట్టారు. వికారాబాద్ జిల్లా సర్కిల్‌లో 3లక్షల 11వేల సర్వీసులు ఉన్నాయి. అర్హులైన వారిని, ఇప్పటికే గుర్తించారు. ప్రభుత్వానికి జిల్లా సర్కిల్ నుంచి రూ. 10 కోట్ల మేరకు భారం అవుతున్నది.

గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

తాండూరు, జూన్ 8: గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలకు అధికారులు అంతా సిద్ధం చేశారు. గ్రూప్ -1 పరీక్షలను దృష్టిలో ఉంచుకొని తాండూరులో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సింధూ డిగ్రీ కాలేజీ, సింధూ బాలికల జూనియర్ కళాశాల, సిద్దార్థ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో మొత్తం 1488 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు.

ఘట్‌కేసర్ రూరల్: నేడు ఆదివారం జరిగే గ్రూప్ -1 పరీక్షలకు అధికారులు అన్నిఏర్పాట్లు చేశారు. మండలంలో 13కేంద్రాల్లో 9,878 మంది అభ్యర్థులు గ్రూప్-1 పరీక్షలు రాయనున్నారు. కొండాపూర్‌లోని విజ్ఞాన మహిళా ఇంజనీరింగు కళాశాల, అవుశాపూర్‌లోని అరోరా, విజ్ఞాన భారతి ఇంజనీ రింగు కళాశాలలు, ఎదులాబాద్‌లోని మెగా ఇంజనీరింగు కళాశాల, అంకుశాపూర్ లోని ఏస్ ఇంజనీరింగు కళాశాల, వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్శిటీలోని రెండు కేంద్రాలు, కొర్రెములలోని సిద్దార్థ కళాశాల, కాచవానిసింగారం, దివ్యానగర్ లోని నల్ల మల్లారెడ్డి కళాశాల, చౌదరిగూడలోని నల్ల నర్సింహ్మా రెడ్డి ఇంజనీరింగు కళాశాలలో పరీక్షలు నిర్వహించనున్నారు.

సంక్షిప్తంగా..

● **ధారూరు:** ధారూరు వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం సాయంత్రం ధాన్యం, మొక్కజొన్న పంట ఉత్పత్తులకు బీట్లు నిర్వహించారు. బీట్లలో ధాన్యం 1010రకం క్వింటాలుకు 2,100నుంచి 2,120వరకు, సోనామసూరి రకం క్వింటాలుకు రూ.2,270 నుంచి 2,380వరకు, మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,170 నుంచి 2340 వరకు క్రయవిక్రయాలు జరిగాయి. ధాన్యం 610క్వింటాళ్లు, 88క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

● **మోమిన్‌పేట్:** చిన్న కొల్కుంద మాజీ సర్పంచ్ కొనింటి సురేశ్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ కాంగ్రెస్ నాయకులు పి.మల్లేశం, ఎస్.రవి, రాజు పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ మండలం రాయిలాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు స్థానిక మాజీ సర్పంచ్ నర్మద గోపాల్‌రెడ్డి శనివారం పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● **నవాబుపేట:** మండలంలోని మైతాప్‌ఖాన్‌గూడ గ్రామంలో గ్రామ కంఠం భూమిని అదే గ్రామానికి చెందిన సత్య వెంకట్‌రెడ్డి ఆక్రమించుకోవడంతో శనివారం కాంగ్రెస్ మండల నాయకులు గణపూరం ప్రసాద్, మండల అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య, జిల్లా నాయకులు ఎల్.రంగారెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో గ్రామ పంచాయతీ నర్సరీ ఉందని, మరి కొంత స్థలం ఉండటంతో సత్య వెంకట్‌రెడ్డి ఆక్రమించుకోవడంతో గ్రామస్థులు వారి దృష్టికి తీసుకెళ్లారు.

● **మేడ్చల్ టౌన్:** మృగశిర సందర్భంగా అస్తమా వ్యాధితో బాధపడే రోగులకు శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సాయి గీత ఆశ్రమంలో అస్తమా నివారణ మందు వేశారు. సుమారు 480మందికి మందు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

● **తాండూరు:** పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ స్టిచింగ్ (టైలరింగ్) చార్జీలను పెంచారు. ఈమేరకు ప్రభుత్వం చార్జీలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. మహిళ సంఘాలు, స్వయం సహాయక సభ్యులకు పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ స్టిచింగ్ చేసేందుకు ఆర్డర్స్ ఇచ్చారు. కుట్టు చార్జీలు సరిపోవని మహిళా సంఘాల ప్రతినిధులు, మెప్మాశాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. యూనీఫామ్ స్టిచింగ్ చార్జ్ రూ.50ల నుంచి రూ.75కు పెంచారు.

● **కీసర రూరల్:** నాణ్యమైన విద్యనందించి విద్యార్థులను తీర్చిదిద్దటమే కేజీఆర్ కళాశాల లక్ష్యమని ఆ కాలేజీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్. కే.గోవిందరెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లిలోని కేజీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రమణారావు, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అసోసియేషన్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, కార్యదర్శి నితన్‌రెడ్డి, హెచ్‌వోడీ రంగేశ్వర్‌రెడ్డి, సునీత, ఎస్.వేణు, రాజశేఖర్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** గోవిందాపూర్ శివారులో శనివారం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బైక్ రైడర్స్‌తో చాంపియన్‌షిప్‌ను ఏర్పాటు చేయగా సీఐ ఆంజనేయులు ప్రారంభించారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం వరకు బైక్ రైడింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ అరవింద్, మల్లారెడ్డి, ఒగ్గు మల్లయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

రామోజీరావు మృతిపట్ల సంతాపం

ధారూరు/దోమ, జూన్ 8: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి శనివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. అదేవిధంగా దోమ మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు కె.రాజిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో రామోజీరావు మృతి తీరని లోటని పేర్కొన్నారు.

మొక్కలు సిద్ధం



బషీరాబాద్, జూన్ 8: ఎనిమిదో విడత తెలంగాణ హరితాహారానికి వన నర్సరీల్లో మొక్కలు రెడీగా ఉన్నాయి. మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో ఈ విడతలో 1.80 లక్షల మొక్కలు నర్సరీల్లో పెంచుతున్నారు. గ్రామ పంచాయతీకి సుమారు 5వేల చొప్పున మొక్కలను పెంచుతున్నట్లు ఉపాధిహామీ పథకం ఈసీ (ఇంజనీరింగ్ కన్సల్టెంట్) నర్సింహారెడ్డి తెలిపారు.

ఉన్నత విద్యనందించడమే లక్ష్యం

పూడూరు, జూన్ 8: పిల్లలకు ఉన్నత విద్యనందించడమే తమ లక్ష్యమని పూడూరు మండల విద్యాధికారి హరిచందర్ అన్నారు. మండలంలోని తిర్మలాపూర్‌లో గ్రామస్తులతో కలిసి శనివారం ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం రత్న, మాజీ సర్పంచ్ పెంటయ్య పాల్గొన్నారు. బడిబాటలో భాగంగా మేడిపల్లి కలాన్‌లో హెచ్ఎం ఖాజామైనుద్దీన్ ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ యాదమ్మ, విష్ణువర్దన్‌రెడ్డి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

పరిగి, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ దుస్తుల పంపిణీ చేస్తున్నట్లు సెర్ప్ ఏపీఎం కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సయ్యద్ మల్కాపూర్‌లో బడిబాటలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఉచితంగా దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మఆదర్శ పాఠశాల నోడల్ అధికారి గోపాల్, పాఠశాల హెచ్ఎం రుక్మిణి, గ్రామ సంఘం అధ్యక్షురాలు రాధ, ఉపాధ్యాయులు శ్యాంసుందర్, సీసీ సంజీవ్, వీవోఏ జ్యోతి పాల్గొన్నారు.

'చంద్రశేఖర్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేద్దాం'

వికారాబాద్, జూన్ 8: తెలంగాణ ఉద్యమంలో, వికారాబాద్ ప్రాంతంలో విద్యాసేవలో స్వర్గీయ చంద్రశేఖర్‌రెడ్డి పాత్ర మరువలేనిదని వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు, వికాస్ జూనియర్ కళాశాల మాజీ కరస్పాండెంట్ దివంగత పులిగారి చంద్రశేఖర్‌రెడ్డి దశమ వర్థంతి సందర్భంగా శనివారం వికాస్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.రాంరెడ్డి, కళాశాల అధ్యాపకులు, మున్నూరు సోమారం గ్రామస్థులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

కులకచర్ల, జూన్ 8: స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు, పరిగి ఇన్‌చార్జి కిరణ్ బూనెటి తెలిపారు. మండలంలోని ముజాహిద్‌పూర్‌లో శనివారం స్వామి వివేకానంద విగ్రహ భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరు స్వామివివేకానంద అడుగుజాడల్లో నడవాలని సూచించారు. త్వరలోనే ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటయ్యగౌడ్, కాటన్‌ప్లి అంజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, జానకిరామ్, మోనాచారి, బుచ్చన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు మహిపాల్, ఆంజనేయులు, అనిల్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

కులకచర్ల, జూన్ 8: మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో శనివారం ఆయిల్ పామ్ సాగుపై ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకో పామ్ ఆయిల్ ఇండస్ట్రీస్ వారు ఆయిల్ పామ్ పంట సాగుపై వివరించారు. ఈ పంటసాగుకు తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలుగా సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. ఈ ప్రాంతంలో భూములు అనువుగా ఉన్నాయని, రైతులు ఈ పంట సాగుకు ముందుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రహ్లాద్‌రావు, సౌమ్యరెడ్డి, వెంకటయ్యగౌడ్, నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వరమే కేసుల పరిష్కారం

పరిగి, జూన్ 8: లోక్ అదాలత్‌లలో కేసుల్లోని ఇరుపక్షాలు రాజీపడితే కేసులను సత్వరమే పరిష్కరిస్తామని పరిగి మున్సిఫ్‌కోర్టు న్యాయాధికారిణి నాగుల శిల్ప అన్నారు. పరిగిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 528 కేసులను పరిష్కరించారు. సీసీ కాంప్రమైజ్ కేసులు 91, ఎస్‌టీసీ ఒకటి, ఎంసీ ఒకటి, ఒఎఫ్ మూడు, ఎస్‌టీసీ అడ్మిషన్ 15, ఎలక్ట్రిసిటీ కేసులు 243, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 86, పెట్టీ కేసులు 52, ఇతర కేసులు రెండు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీవో దీపారాణి, ఏజీపీ బి.వెంకట్‌రెడ్డి, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.